క్లుప్తంగా

అభివృద్ధి కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి



పట్నంబజారు: గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు ప్రతి అభివృద్ధి కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ముందుకు సాగుతోందని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా చెప్పారు. నియోజకవర్గంలోని 57వ డివిజన్ మంగళదాస్‌నగర్‌లో రూ. 8లక్షల వ్యయంతో నిర్మించనున్న విద్యుత్ స్తంభాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నూరిఫాతిమా మాట్లాడుతూ గత ప్రభుత్వం కనీసం సైడు కాల్వలు కూడా ఏర్పాటు చేయని దుస్థితి ఉందన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి శివారు కాలనీల్లో మౌలి క వసతుల కల్పనకు ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ఆయన ముందుకు సాగుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పఠాన్ రిహానా, వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు దుర్గాశ్యామ్‌కు పురస్కారం



గుంటూరు ఎడ్యుకేషన్: శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్‌ఈ పాఠశాల ఉపాధ్యాయుడు డి. దుర్గాశ్యామ్ కేవీఆర్-జయలక్ష్మి ఎడ్యుకేషనల్ ట్రస్టు ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రతిభా పురస్కారాన్ని అందుకున్నట్లు కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. లక్ష్మీపురం మెయిన్ రోడ్డులోని పాఠశాలలో శనివారం జరిగిన కార్యక్రమంలో విష్ణువర్ధన్ మాట్లాడారు. నిపుణులైన ఉపాధ్యాయ బృందంతో నాణ్యమైన బోధన అందిస్తున్నందుకు గుర్తుగా తమ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు ప్రముఖ సంస్థల నుంచి పురస్కారాల్ని అందుకుంటున్నారని చెప్పారు. శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీలు కె.ఎస్. లక్ష్మణరావు, ఐ. వెంకటేశ్వరరావు, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, విద్యాశాఖ డైరెక్టర్ పి.పార్వతి నుంచి అవార్డు అందుకున్న దుర్గాశ్యామ్‌ను పాటిబండ్ల విష్ణువర్ధన్‌తో పాటు పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్స్ జంపని పద్మజ, పార్వతీదేవి, బోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు.

భార్యపై భర్త దాడి

గుంటూరు ఈస్ట్: భార్యపై భర్తతో పాటు అతడి కుటుంబ సభ్యులు కలసి దిశ పోలీసుస్టేషన్ వెలుపల దాడి చేసిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఫయాజ్‌ఖాన్ అతని భార్య నిహా పర్వీన్ గొడవ పడి విడిపోయారు. శనివారం ఇద్దరూ కుటుంబ సభ్యులతో కలసి దిశ పోలీసుస్టేషన్‌కు హాజరయ్యారు. ఆ తర్వాత స్టేషన్ నుంచి బయటకురాగానే ఫయాజ్‌ఖాన్ అతని కుటుంబ సభ్యులు నిహా పర్వీన్‌పై దాడి చేసి కొట్టారు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అద్దె బకాయి అడిగినందుకు యజమానిపై..

అద్దె బకాయి అడిగినందుకు ఓ వ్యక్తి అతని కుటుంబ సభ్యులు ఇంటి యజమానిపై దాడి చేసిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. భవానీపురంలో నివసించే కె.లావణ్య తన ఇంటిని మణికంఠ అనే వ్యక్తికి అద్దెకు ఇచ్చింది. అతడు మూడు నెలలుగా అద్దె చెల్లించడం లేదు. శనివారం లావణ్య ఇంటికి వెళ్లి అద్దె చెల్లించాల్సిందిగా అడిగింది. మాటామాట పెరిగి మణికంఠ, అతని కుటుంబ సభ్యులు లావణ్యపై దాడి చేసి కొట్టారు. ఈ మేరకు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పురుగు మందు తాగి మహిళ ఆత్మహత్యాయత్నం

వేజండ్ల(చేబ్రోలు): మహిళ పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన చేబ్రోలు మండలం వేజండ్లలో శనివారం జరిగింది. దళితవాడకు చెందిన వేజండ్ల కరుణమ్మ కొద్ది రోజులుగా కుటుంబసమస్యలతో సతమతమవుతోంది. శనివారం పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది. బంధువులు గమనించి 108 వాహనం ద్వారా గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

డీటీసీ షేక్ కరీం



వాక్‌థాన్‌లో పాల్గొన్న డీటీసీ కరీం, డీఎస్పీ బాలసుందరరావు తదితరులు

పట్నంబజారు: రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యతని డీటీసీ షేక్ కరీం, ట్రాఫిక్ డీఎస్పీ ఎం. బాలసుందరరావు చెప్పారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా శనివారం పోలీస్ పేరేడ్ గ్రౌండ్స్ నుంచి మూడు బొమ్మల సెంటర్ వరకు వాక్‌థాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీసీ షేక్ కరీం మాట్లాడుతూ కారు డ్రైవింగ్ చేసే ప్రతి ఒక్కరూ సీటు బెల్టు పెట్టుకోవటంతో పాటు, పూర్తిస్థాయి నిబంధనలు పాటించాలని సూచించారు. వాహనంతో రోడ్డుపైకి వచ్చే ప్రతి ఒక్కరూ కచ్చితంగా సంబంధిత ధ్రువీకరణ పత్రాలు వారి వద్ద ఉంచుకోవాలని తెలిపారు. ట్రాఫిక్ డీఎస్పీ ఎం. బాలసుందరరావు మాట్లాడుతూ రోడ్డు భద్రత నిబంధనలు పాటించకపోతే ప్రమాదాలకు ఆస్కారం ఇచ్చిన వారమవుతామని చెప్పారు. అనంతరం విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. విద్యార్థులు, ఆటోడ్రైవర్లు, పోలీసు సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆర్టీఏ అధికారులు జి. గోపాల్, టి. రాఘవరావు, మల్లీశ్వరి, సౌజన్య, సంధ్య, మధుసూదనరావు పాల్గొన్నారు.

రెండు రోజుల పాటు కాచి చల్లార్చిన నీరు తాగాలి

కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: నగరానికి ప్రధాన నీటి వనరైన ప్రకాశం బ్యారేజీకి పులిచింతల నుంచి వస్తున్న నీటి సాంద్రత అధికంగా ఉందని, దీని వలన నగరపాలక సంస్థ ఫిల్టర్ రేషన్ పాయింట్స్ తగినంత నీటిని ఫిల్టర్ చేయలేకపోతున్నాయని నగర కమిషనర్ కీర్తి చేకూరి శనివారం ప్రకటనలో తెలిపారు. ప్రకాశం బ్యారేజీలో ముడి నీటి సాంద్రత అధికంగా మరో రెండు రోజులు ఉండే అవకాశం ఉందని, నగరంలో నీటి కొరత లేకుండా స్పెషల్ యాక్షన్ ప్లాన్ తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారుల్ని ఆదేశించారు. ఉండవల్లి, తక్కెళ్లపాడు పంపింగ్ కేంద్రాల వద్ద వాటర్ సప్లై ఏఈ, డీఈఈలు ఆలం, క్లోరిన్ తగుపాళ్లలో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రిజర్వాయర్ల వద్ద కూడా సంబంధిత ఏఈ, డీఈఈలు తాగునీటిలో 2 పీపీఎం క్లోరిన్ ఉండేలా పర్యవేక్షణ చేయాలని కమిషనర్ సూచించారు. సచివాలయం పరిధిలో తాగునీటి సరఫరా జరిగే సమయంలో ఎమినిటీ కార్యదర్శులు క్లోరిన్ శాంపిల్స్ పరిశీలించాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో నగర ప్రజలు రెండు రోజులు పాటు కాచి చల్లార్చి తాగాలని, ఫిల్టరేషన్ సమస్య వల్ల ఏదైనా ప్రాంతంలో తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడినా సహకరించాలని ఆమె కోరారు.

ఆర్‌వీఆర్‌జేసీకి జాతీయ స్థాయిలో పలు అవార్డులు



అవార్డులను ప్రదర్శిస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: ఐఐటీ మద్రాస్, ఎన్‌పీటీఈఎల్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సుల్లో తమ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచి జాతీయ స్థాయిలో అవార్డుల పంటను పండించారని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు ఆర్. శ్రీనివాస్ తెలిపారు. చౌడవరంలోని కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు కనబరిచిన ప్రతిభకు జాతీయ స్థాయిలో ఏఏ రేటింగ్, ఎన్‌పీటీఈఎల్ స్టార్స్, డొమైన్ స్కాలర్ అవార్డులు సాధించడం తమ కళాశాలకెంతో గర్వకారణమని పేర్కొన్నారు. అవార్డుల్ని ఇటీవల ఐఐటీ మద్రాస్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ ఎం.వి.పి. చంద్రశేఖరరావు అవార్డుల్ని అందుకున్నట్లు తెలిపారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్. గోపాలకృష్ణ, ట్రెజరర్ కె. కృష్ణప్రసాద్, పాలక మండలి సభ్యులు మాట్లాడుతూ అన్ని ఎన్‌పీటీఈఎల్ చాప్టర్స్‌లో తమ కళాశాల అత్యుత్తమ స్థానంలో నిలవడం సంతోషకరమని తెలిపారు. 2017 నుంచి ఇప్పటి వరకు మూడు సార్లు ఏఏఏ రేటింగ్, 10వ సారి ఏఏ రేటింగ్‌ను కళాశాల సాధించిందని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె. శ్రీనివాస్, డైరెక్టర్ కె. రవీంద్ర, ఏవో డైరెక్టర్ ఎస్.వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మహిళా విద్యే దేశానికి శ్రీరామరక్ష

ఎమ్మెల్సీ టి.కల్పలతా రెడ్డి



విద్యార్థినికి ఉపకార వేతనాన్ని అందజేస్తున్న ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి, కార్పొరేటర్ లక్ష్మీ శ్రీనివాస్‌రెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: మహిళా విద్య దేశానికి శ్రీరామరక్ష అని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ టి.కల్పలతారెడ్డి పేర్కొన్నారు. అనవేమా ట్రస్టు ఆధ్వర్యంలో స్తంభాల గరువులోని ఉడుముల కోటిరత్నం-సాంబిరెడ్డి బాలికల హాస్టల్‌లో శనివారం దాతల సహకారంతో ఉపకార రూ.10 లక్షల ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. 50 మంది విద్యార్థినులకు ఒక్కొక్కరికీ రూ.10వేలు చొప్పున రూ.ఐదు లక్షలతో పాటు బండి సాహితీ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 10 మంది విద్యార్థినులకు రూ.50 వేలు చొప్పున మరో రూ.ఐదు లక్షలు అందజేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి మాట్లాడుతూ ఏ సమాజమైనా సామాజిక, రాజకీయ అభివృద్ధి చెందాలంటే పురుషులతో పాటు మహిళలు సైతం విద్యావంతులుగా ఎదగడం తప్పనిసరని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మహిళా విద్యకు అందిస్తున్న ప్రోత్సాహం గతంలో మరే ప్రభుత్వాలు చేయలేదని చెప్పారు. పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల జీవన మార్పుకు విద్య పునాది కావాలన్నారు. వేలాది కోట్ల రూపాయలతో నాడు-నేడు ద్వారా పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు కల్పించడంతోపాటు విద్యార్థుల భవిష్యత్తుకు అన్ని విధాలా కృషి చేస్తున్న సీఎం వైఎస్. జగన్‌కు కులమతాలకతీతంగా సహకరించాల్సిన అవసరం ఉందని కోరారు. ఉపకార వేతనాలు అందుకున్న విద్యార్థినులు దాతల సహకారాన్ని మరువకుండా అనుకున్న లక్ష్యాల్ని చేరుకుని, తిరిగి వారు సైతం దాతలుగా మారాలని కోరారు. 15 ఏళ్లుగా ట్రస్ట్ ద్వారా బాలికల హాస్టల్ నడుపుతూ వందలాదిమందికి ఉచిత భోజన, వసతి సదుపాయాలతో పాటు ఉపకార వేతనాలు అందించడం అభినందనీయమని కొనియాడారు. అనంతరం ఎమ్మెల్సీ కల్పలతారెడ్డిని అనవేమా ట్రస్ట్ బాలికల వసతి గృహ కమిటీ సభ్యులు, బండి సాహితీ రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఇంటి ఆడపడుచుగా భావించి గంధం, పసుపుకుంకుమలు, నూతన వస్త్రాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో 31వ డివిజన్ కార్పొరేటర్ ఉడుముల లక్ష్మీ శ్రీనివాస్‌రెడ్డి, దుంప రవీంద్రారెడ్డి, సృజన, ఆవుల సాంబిరెడ్డి, హైకోర్టు న్యాయవాది మారెళ్ల రాధా, బండి అశోక్ రెడ్డి, వసతి గృహ అధ్యక్షుడు ఉడుముల శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి వణుకూరి సూరారెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులే సమాజ మార్గ నిర్దేశకులు



పురస్కారాలు పొందిన ఉపాధ్యాయులతో ఎమ్మెల్సీ లక్ష్మణరావు, కన్న మాస్టారు, పార్వతి, డొక్కా మాణిక్య వరప్రసాద్, వెంకటేశ్వరరావు

ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులే సమాజ మార్గ నిర్దేశకులని ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు పేర్కొన్నారు.కేవీఆర్ అండ్ జయలక్ష్మి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ సోషల్ సైన్సెస్ ఉపాధ్యాయుల ప్రతిభా పురస్కార మహోత్సవాన్ని శనివారం మార్కెట్ సెంటర్లోని శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహించారు. కన్న విద్యాసంస్థల డైరెక్టర్ కన్న మాస్టారు అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యార్థుల్ని సామాజిక అవగాహనతో పాటు బాధ్యతతో కూడిన పౌరులుగా తీర్చిదిద్దడంలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు విశేష కృషి చేస్తున్నారని తెలిపారు. గత నాలుగు దశాబ్దాలుగా విద్యా బోధనలో వచ్చిన సమూల మార్పుల కారణంగా విలువల స్థానంలో ఉపాధికి ప్రాధాన్యత నిచ్చే సైన్స్ అండ్ టెక్నాలజీలకు డిమాండ్ పెరిగిందన్నారు. ప్రప్రథమంగా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల్ని గౌరవించి సత్కరించే అవకాశం కేవీఆర్ అండ్ జయలక్ష్మి ఎడ్యుకేషన్ ట్రస్టుకు దక్కడం గర్వకారణమని తెలిపారు. విశిష్ట అతిథులుగా పాల్గొన్న మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు కేవీఆర్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ చేస్తున్న విద్యా సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా పౌరశాస్త్ర అధ్యాపకుడు నూతలపాటి వీరప్రకాశరావును విశిష్ట ప్రతిభా పురస్కారంతో సత్కరించడంతోపాటు 46 మంది సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల్ని సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యాశాఖ కో-ఆర్డినేషన్ డైరెక్టర్ పి.పార్వతి, వీజీఎస్ పబ్లిషర్స్ అధినేత ఎస్.రామారావు, యూటీఎఫ్ కార్యదర్శి ఎం.కళాధర్, ఎడ్యుకేషనల్ ట్రస్ట్ కార్యదర్శి కె.అలీస్, కె. విజయలక్ష్మి పాల్గొన్నారు.

నాట్కో ట్రస్టు సేవలకు అవార్డు



కలెక్టర్ వేణుగోపాలరెడ్డి నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న నాట్కో ట్రస్టు వైస్ చైర్మన్ నన్నపనేని సదాశివరావు

గుంటూరు మెడికల్: జీజీహెచ్‌లో పేద రోగులకు కార్పొరేట్ వైద్య సేవలు అందేలా కృషి చేస్తున్న నాట్కో ట్రస్టు సేవలకు అవార్డు లభించింది. గణతంత్ర దినోత్సవంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి చేతుల మీదుగా నాట్కో ట్రస్టు వైస్ చైర్మన్ నన్నపనేని సదాశివరావు ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. 2015లో గుంటూరు జీజీహెచ్‌లో ఎలుకల దాడిలో పసికందు మృతి చెందిన సంఘటనపై చలించిపోయి నాట్కో ట్రస్టు చైర్మన్ నన్నపనేని వెంకయ్యచౌదరి జీజీహెచ్‌లో పిల్లల వార్డును రూ. 3కోట్లతో నిర్మించారు. అనంతరం రూ. 2 కోట్లతో వార్డులో వార్మర్లు, ఫొటోథెరపీ యూనిట్లు, సీ ప్యాప్ మిషన్లు ఏర్పాటు చేశారు. పసికందులకు అత్యవసర వైద్య సేవలు అందించే ఎన్‌ఐసీయూ, పీఐసీయూ వైద్య విభాగాలను 2017లో రూ. కోటితో ఆధునీకరించారు. న్యూరాలజీ వైద్య విభాగంలో నిద్ర సమస్యలకు చెక్ పెట్టేందుకు అవసరమైన రూ. 25 లక్షల ఖరీదు చేసే స్లీప్ ల్యాబ్ మిషన్‌ను అందజేశారు. నర్సింగ్ విద్యార్థులకు వసతి గృహంలో రూ. కోటితో పలు గదులు, మరుగుదొడ్లు నిర్మాణం చేశారు. ఆర్థోపెడిక్ వైద్య విభాగంలో 2018లో రూ. కోటితో మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్ నిర్మించారు. రాష్ట్రంలోనే మొట్టమొదటి క్యాన్సర్ సెంటర్‌ను నాట్కో ట్రస్టు గుంటూరు జీజీహెచ్‌లో కార్పొరేట్ వైద్య సౌకర్యాలతో రూ. 45 కోట్లతో నిర్మించింది. ప్రతి ఏడాది రూ. 2 కోట్లకు పైగా ఖరీదు చేసే క్యాన్సర్ మందుల్ని రోగులకు ఉచితంగా అందిస్తున్నారు. త్వరలోనే రూ.13 కోట్లతో క్యాన్సర్ చివరి దశలో ఉండే రోగుల కోసం ప్రత్యేకంగా భవనాన్ని నిర్మించేందుకు నాట్కో ట్రస్టు ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. 2015 నుంచి నిరంతరం జీజీహెచ్ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్న నాట్కో ట్రస్టు సేవలు వెలకట్టలేనివని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ తెలిపారు. కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న నన్నపనేని సదాశివరావుకు అభినందనలు తెలిపారు.


క్రెడాయ్ ప్రాపర్టీ షోకు అనూహ్య స్పందన



విజేతకు స్మార్ట్ టీవీ అందజేస్తున్న ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, మామిడి రాము తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: క్రెడాయ్ గుంటూరు చాప్టర్ ఆధ్వర్యంలో రింగ్‌రోడ్డులోని సిద్ధార్థ కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన ప్రాపర్టీ షోకు అనూహ్య స్పందన లభిస్తోందని ఆంధ్రప్రదేశ్ క్రెడాయ్ చైర్మన్ ఆళ్ల శివారెడ్డి పేర్కొన్నారు. శనివారం క్రెడాయ్ ప్రాపర్టీలో భాగంగా లక్కీడ్రాలో విజేతలుగా నిలిచిన నెహ్రూనగర్‌కు చెందిన వి.ఎస్. ప్రసాద్‌కు స్మార్ట్ టీవీని ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం అందజేశారు. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కొనుగోలు దారులకు నచ్చే విధంగా నాణ్యమైన నిర్మాణంతో క్రెడాయ్ గుంటూరు ఇండిపెండెంట్ హౌసెస్‌తో పాటు అపార్ట్‌మెంట్స్, విల్లాస్, గేటెడ్ కమ్యూనిటీ వెంచర్లు, ఫ్లాట్లను అందరికీ అందుబాటులో ధరల్లో అందుబాటులోకి తెచ్చిందని తెలిపారు. ఎమ్మెల్సీ ఏసురత్నం మాట్లాడుతూ అమ్మకందారులకు, కొనుగోలుదారులకు చక్కటి వేదికను క్రెడాయ్ ఏర్పాటు చేసిందని అభినందించారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. క్రెడాయ్ ఏపీ అధ్యక్షుడు వై.వి.రమణారావు, ప్రధాన కార్యదర్శి బి. శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రాపర్టీ షోలో ప్రతి రోజూ 10 మంది విజేతలకు బహుమతులు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో క్రెడాయ్ గుంటూరు చాప్టర్ అధ్యక్షుడు మామిడి రాము, ఉపాధ్యక్షుడు మెట్టు సాంబశివారెడ్డి, కార్యదర్శి తియ్యగూర వినోద్‌రెడ్డి, కోశాధికారి ఎం.ఎస్.వి.కార్తిక్, సంయుక్త కార్యదర్శి ఆళ్ల నాగార్జునరెడ్డి, శివనాగేశ్వరరావు, రమాకాంత్, ప్రాపర్టీ షో కన్వీనర్ గుంటూరు వెంకటరెడ్డి, ఈసీ సభ్యులు పాల్గొన్నారు.

దివ్యాంగునికి బజరంగ్ త్రిచక్ర వాహనం అందజేత



రత్నానికి వాహనాన్ని అందజేస్తున్న బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అంబటి మురళీకృష్ణ

చేబ్రోలు: పేద దివ్యాంగునికి బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం త్రిచక్ర వాహనాన్ని అందజేశారు. జగనన్న సంక్షేమ సంగమం కార్యక్రమంలో భాగంగా ఇటీవల బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేబ్రోలు మండలం నారాకోడూరులో నేత్ర జ్యోతి, మీ గుండె పదిలం, దివ్యాంగ దర్శిని తదితర కార్యక్రమాల్ని నిర్వహించారు. గ్రామానికి చెందిన దివ్యాంగుడైన మంచాల రత్నం నడవలేని స్థితిలో పడుతున్న ఇబ్బందులను అంబటి మురళీకృష్ణ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన నారాకోడూరులోని రత్నం ఇంటి వద్దకు వెళ్లి ట్రై సైకిలును అందజేశారు. రత్నం దైనందిన కార్యక్రమాలు నిర్వహించడానికి వెస్ట్రన్ కమోడ్‌ను కూడా సమకూర్చారు. ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను స్ఫూర్తిగా తీసుకుని బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాల పరంపరను కొనసాగిస్తున్నట్లు అంబటి మురళీకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

గుండె సర్జరీ చేయించుకున్న మహిళకు పరామర్శ

మీ గుండె పదిలం కార్యక్రమంలో అత్యవసర గుండె సర్జరీగా నిర్ధారించటంతో బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విజయవాడ మెడ్‌స్టార్ హాస్పిటల్‌లో సర్జరీ పూర్తి చేసుకున్న కొల్లా సరస్వతిని అంబటి మురళీకృష్ణ పరామర్శించారు. నేత్ర జ్యోతి వైద్య శిబిరంలో కళ్లజోళ్లు పొందిన స్థానికులు ఆయన్ను అభినందించారు. కార్యక్రమంలో స్థానికులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మద్యం సీసాలు స్వాధీనం

కోయవారిపాలెం (ప్రత్తిపాడు): అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని ప్రత్తిపాడు పోలీసులు అరెస్టు చేశారు. ప్రత్తిపాడు మండలం కోయవారిపాలెంలో రామినేని శ్యాంబాబు అక్రమంగా మద్యాన్ని అధిక ధరలకు విక్రయిస్తున్నాడన్న సమాచారం పోలీసులకు శనివారం అందింది. దీంతో హెడ్‌కానిస్టేబుల్ బ్రహ్మానాయుడు అతడ్ని అదుపులోకి తీసుకుని, ఐదు మద్యం సీసాల్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరుస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

గుంటూరు కళా పరిషత్ నాటకోత్సవాలు ప్రారంభం



ఎనిమీ నాటికలోని సన్నివేశం

పాత గుంటూరు: రాజాగారితోటలోని శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో గుంటూరు కళాపరిషత్ 26వ వార్షిక నాటక ఉత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ప్రముఖ సాహితీవేత్త బి. వేదయ్య కళావేదికపై నిర్వహించిన నాటికలు ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నాయి. పి.ఎస్. నారాయణ మూల కథ, పరమాత్ముని శివరాం నాటకీకరణ, రమేష్ మంచాల దర్శకత్వంలో కరీంనగర్ చైతన్య కళాభారతి కళాకారులు 'స్వప్నం రాల్చిన అమృతం' సాంఘిక నాటిక ప్రదర్శించారు. కవి పీఎస్ఎం రచన, దర్శకత్వంలో ఇబ్రహీంపట్నం వీటీపీఎస్ కల్చరల్ అసోసియేషన్ కళాకారులు 'ఎనిమీ' సాంఘిక నాటిక ప్రదర్శించారు. కావూరి సత్యనారాయణ రచనకు, ఏపూరి హరిబాబు దర్శకత్వంలో గుంటూరు అమరావతి కల్చరల్ అసోసియేషన్ కళాకారులు 'అమృత హస్తం' సాంఘిక నాటిక ప్రదర్శించి ప్రేక్షకుల ప్రశంసలు పొందారు. అనంతరం జరిగిన సభకు కళా పరిషత్ అధ్యక్షులు పి.వి. మల్లికార్జునరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ వి. రామలింగయ్య, పౌరాణిక రంగస్థల కళాకారులు నలకా శ్రీనివాసరావు, కళాపరిషత్ ప్రధాన కార్యదర్శి బి పూర్ణ, కార్యదర్శులు అమ్మిశెట్టి శివ, గుమ్మడి నాగేశ్వరరావు, సభ్యులు పాల్గొని కళాకారుల్ని సత్కరించారు.

15 ఏళ్ల సమస్యకు ఆపరేషన్‌తో విముక్తి

70 ఏళ్ల వృద్ధుడికి అరుదైన ఆపరేషన్

గుంటూరు మెడికల్: రెండు మోకాళ్లలో తీవ్రమైన నొప్పులతో 15 సంవత్సరాలుగా బాధపడుతున్న 70 ఏళ్ల వృద్ధుడికి అరుదైన, క్లిష్టమైన ఆపరేషన్ చేసి నొప్పి మాయం చేశామని శ్రీరామచంద్ర జాయింట్ రీ ప్లేస్‌మెంట్ సెంటర్‌కు చెందిన సర్జన్ డాక్టర్ పోట్ల శివయ్య చెప్పారు. స్థానిక డొంక రోడ్డులోని ఆస్పత్రిలో శనివారం జరిగినవిలేకరుల సమావేశంలో ఆపరేషన్ వివరాలను ఆయన వెల్లడించారు. బాపట్ల జిల్లా కొలగానివారిపాలేనికి చెందిన 70 ఏళ్ల దాడి వెంకటేశ్వర్లు 15 ఏళ్లుగా రెండు మోకాళ్లలో తీవ్రమైన నొప్పులతో బాధపడుతూ, నడవలేక మంచానికే పరిమితమయినట్లు తెలిపారు. కుడి మోకాలు లోపల 40 డిగ్రీలు, ఎడమ మోకాలు 50 డిగ్రీలు వెలుపలకు వంగిపోయి ఉన్నట్లు వెల్లడించారు. వైద్య పరిభాషలో ఈ వ్యాధిని 'విండ్ స్వైప్ డిఫార్మిటీ ' అంటారన్నారు. పలువురు వైద్యులను కలిసినా నొప్పి తగ్గక, తమ ఆస్పత్రికి 2023 నవంబర్‌లో వచ్చినట్లు చెప్పారు. పరీక్షలు చేసి, నవంబర్ 27 కుడి మోకీలు మార్పిడి ఆపరేషన్ విజయవంతంగా చేశామన్నారు. మరలా 2024 జనవరి 23న అమెరికా నుంచి ప్రత్యేకంగా దిగుమతి చేసుకున్న ఇంప్లాంట్స్‌తో ఎడమ మోకీలుకు సుమారు ఐదు గంటల సేపు ఆపరేషన్ చేసి నొప్పి, ఒంకర, ఇతర సమస్యలు లేకుండా చేశామని వివరించారు. సమస్యలు లేకపోవడంతో శనివారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేసినట్లు వెల్లడించారు.

కేంద్ర ప్రభుత్వ పథకాల కరపత్రాలు పంపిణీ

గుంటూరు మెడికల్: బీజేపీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ వల్లూరు జయప్రకాష్ నారాయణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విజయ సంకల్పయాత్ర శనివారానికి ఐదో రోజుకు చేరుకుంది. స్థానిక సీతమ్మ కాలనీ అంకమ్మ తల్లి గుడి వద్ద ప్రారంభమైన యాత్ర నల్లకుంట, జూట్ మిల్ కాలనీ, రామిరెడ్డి నగర్, శ్రీరామ్ నగర్, చుట్టుగుంట పోలేరమ్మ తల్లి దేవాలయం వరకు సాగింది. ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు, జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్రకుమార్ హాజరయ్యారు. వల్లూరు జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ యాత్రలో భాగంగా శనివారం ఇంటింటికీ కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి పథకాల కరపత్రాలని ప్రజలకు అందించామని తెలిపారు.